క్లుప్తంగా

శ్రీచౌడేశ్వరిదేవికి ప్రత్యేక అలంకరణ



పూజలు అందుకుంటున్న శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : మండలంలోని కోన గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీచౌడేశ్వరిదేవి ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఏటా ఉగాది మరుసటిరోజు నిర్వహించే మొక్కుల చెల్లింపు గురువారం ఉదయం నుంచి సాయంత్రం 3 గంటల వరకు కొనసాగింది. మండలంలోని కోన పంచాయతీలోని కోన, తిప్పిగారిపల్లె, బంగారువాండ్లపల్లె గ్రామాలే కాక గుడిబండ పంచాయతీలోని యల్లంగుడిబండ, గొళ్ళపల్లె, దళితవాడ గ్రామాల ప్రజలు 102 బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయంత్రం ఉపవాసదీక్షతో ఉన్న భక్తులు పవిత్ర జ్యోతులను తయారు చేసి, అమ్మవారిని అలంకరించిన చాందినీ బండిలో సింహవాహనంపై కోన గ్రామ వీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగింపు చేస్తున్న భక్తులు

పెద్దతిప్పసముద్రం : ఉగాది సందర్భంగా బుధవారం రాత్రి మండల కేంద్రంలో శివుడు, చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పల్లకీ మోసి పూజలు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రెడ్డెప్పరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న హరీష్‌రెడ్డి

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి పంచాయతీ మద్దెల చెరువుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డెప్పరెడ్డి (65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి గురువారం మద్దెల చెరువుపల్లికి చేరుకొని రెడ్డెప్పరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ధనుంజయ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఓరుగంటి రమేష్, ఫారుఖ్, వెంకటమణరెడ్డి, చెంగల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కలికిరి: మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలకు చెందిన వాసునూరి బసవరాజ(52) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఏపీఎండీసీ డైరెక్టర్ సి.హరీష్‌రెడ్డి గురువారం కొటాలకు చేరుకుని బసవరాజ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడీ హరి, వెంకటపతి, బావాజీ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి



ఆర్టీసీ డ్రైవర్, కండెక్టర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎం కుమార్

పీలేరు రూరల్ : ఆర్టీసీకి ఆదాయం పెంచి ఖర్చు తగ్గించాలని డీఎం బి.కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్, కండెక్టర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఆదేశించారు. ఇంధన పొదుపు ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆర్టీసీ డ్రైవర్, కండెక్టర్లతో డీఎం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండెక్టర్లు పాల్గొన్నారు.

26న టెన్నిస్‌బాల్ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

సిద్దవటం : వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి అండర్ 17 బాల, బాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 26వ తేదీన 9.30 గంటలకు మైదుకూరు పట్టణంలోని మేధా డిఫెన్స్ అకాడమీలో జరుగుతున్నట్టు టెన్నిస్ బాల్ క్రికెట్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి బి.వి. సుబ్బయ్య తెలిపారు. 2006 జనవరి 1 తరువాత పుట్టిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం

తంబళ్లపల్లె : వేసవిలో ప్రజలు వడదెబ్బ దారిన పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ మునికుమార్ కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రథమ చికిత్సా కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచినీరు ఎక్కువగా తాగే విధంగా తెలియజేయాలన్నారు. తహసీల్దార్ కళావతి, ఎంపీడీఓ ఆనందకుమార్, ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : తలనొప్పి, తలతిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండటం, మత్తునిద్ర, ఫిట్స్, అపస్మారకస్థితి కలిగి ఉంటే వడదెబ్బ లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యచికిత్సలు అందించాలని తహసీల్దార్ సీఆర్ మంజుల, ఎంపీడీఓ లీలామాధవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య, సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో వేసవి జాగ్రత్తలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడదెబ్బ బారిన పడిన వారిని సమీప ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు తీసుకొచ్చి వెంటనే వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రజనీకుమారి, సీహెచ్ఓ మల్లిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథరెడ్డి, ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నిమ్మనపల్లె : మాట్లాడుతున్న ఎంపీడీఓ లీలామాధవి



తంబళ్లపల్లె: మాట్లాడుతున్న డాక్టర్ మునికుమార్

బి.కొత్తకోట : వేసవిపై గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచి ముందస్తు జాగ్రత్తలు పాటించే విధంగా చూడాలని తహసీల్దార్ ధనుంజయలు, ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఆరీఫుల్లా, ఎంఈవో రెడ్డిశేఖర్, ఏఓ మురళీమోహన్, ఏఈలు జి.లావణ్య, దినేష్, మున్సిపల్ మేనేజర్ బి.రమాదేవి, ఏఎస్ఓ అశ్విని పాల్గొన్నారు.

గుర్రంకొండ : వడగాలల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఖాజాబీ, మండల వైద్యాధికారి రవీంద్రనాయక్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రజల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటేశులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ లాల్‌స్వామి, ఎపీవో రెడ్డిజవహర్, ఎపీఎమ్ రమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

కలికిరి : వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యపై ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, తహసీల్దారు భాగ్యలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగయ్య

అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

కురబలకోట : ఈ సారి ఎండలు గరిష్ట స్థాయిలో ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే జాగ్రత్త వహించాలని తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి.దస్తగిరి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరక్కుండా చూడాలన్నారు. సీజనల్‌గా వచ్చే పుచ్చకాయలు, కర్బూజా, కొబ్బరి బోండాం, తాటి ముంజలు, పండ్ల రసాల లాంటివి తీసుకోవాలన్నారు. వైద్యాధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ దాతల సహకారంతో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కూడా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దిలీప్‌కుమార్, వైస్ ఎంపీపీ భూదేవి పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎఫ్‌బీఓ భవనం పరిశీలిస్తున్న రవిచంద్రబాబు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలో ఎఫ్‌బీఓ(రైతు ఉత్పత్తిదారుల సంఘం) సేకరణ కేంద్ర భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవిచంద్రబాబు సూచించారు. గురువారం ఎఫ్‌బీఓ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సభ్యులతో చర్చించారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారి తేజస్విని, సీఈఓ ప్రభావతి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ చేరిన ప్రశ్నపత్రాలు



పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్న అధికారులు

రామసముద్రం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు గురువారం రాయచోటి నుంచి రామసముద్రం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నట్లు ఎంఈవో హేమలత తెలిపారు. రామసముద్రం మండలంలో రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు. మొత్తం 493 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మోడల్‌స్కూల్‌లో 243 మంది, రామసముద్రం జెడ్పి ఉన్నత పాఠశాలలో 250 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ మేరకు ప్రశ్నాపత్రాలను జాగ్రత్తగా స్టేషన్‌లో భద్రపరిచినట్లు పేర్కొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి నిధుల మంజూరు

వాల్మీకిపురం : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు రూ.6 లక్షల నిధులు మంజూరైనట్లు ఏపీ ఎండీసీ ఈఈ ధనుంజయరెడ్డి అన్నారు. ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని మౌలిక వసతులను పరిశీలించి, సమస్యలున్న చోట మంజూరైన రూ.6 లక్షల నిధులను ఖర్చు చేసి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ కరీముల్లా, జేఈ ముస్తాఫా, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫైరోజా బేగం, సిబ్బంది పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనపై ఆరా తీస్తున్న ఈఈ ధనుంజయరెడ్డి

చెత్త సంపదతో పంచాయతీకి ఆదాయం

వాల్మీకిపురం : చెత్త సంపదను సృష్టించడం వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని డీఎల్‌పీవో జయకుమారి అన్నారు. గురువారం బోగంపల్లి మినీ రిజర్వాయర్ సమీపంలో తడి చెత్త, పొడి చెత్త ద్వారా సంపదను ఎలా పొందడం అనే కార్యక్రమంపై మదనపల్లి డివిజన్ స్థాయిలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్‌పీవో మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్త సేకరించడం ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాలు పరిశుభ్రంగా ఉండడమే కాకుండా.. సేకరించిన చెత్త ద్వారా సంపదను సృష్టించి, పంచాయతీకి ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి, ఈవోపీఆర్‌డీ శకుంతల, ఆజాద్, కలికిరి, బి.కొత్తకోట, వాల్మీకిపురం పంచాయతీల సర్పంచ్‌లు, సెక్రటరీలు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో జయకుమారి

దారి సమస్య పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

మదనపల్లె : మండంలోని పోతబోలు పంచాయతీ తురకపల్లె కాలనీలో దారి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు గురువారం సబ్‌కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తురకపల్లె కాలనీలో కొందరు వ్యక్తులు నకిలీ డీకేటీ పట్టాల సాకుతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని, కాలనీలో రోడ్లను బ్లాక్ చేస్తూ దారి సమస్యను సృష్టిస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఆర్డీఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఆర్డీఓ పరిష్కారానికి తహసీల్దార్‌ను ఆదేశించడంతో వీఆర్వో నరేంద్ర క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. బాధితుల వినతి మేరకు తురకపల్లె కాలనీలో 15 అడుగుల రోడ్డుకు కేటాయించి సమస్యను పరిష్కరించారు. సబ్‌కలెక్టరేట్‌లో నిరసన తెలిపిన వారిలో శారద, సుశీల, విజయకుమారి, రమణమ్మ, రామచంద్ర, జయలక్ష్మి, రెడ్డెమ్మ, శ్రీనివాసులు ఉన్నారు.

గ్రామాల్లో వైద్యసేవలకే ఫ్యామిలీ ఫిజీషియన్

కలకడ : గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ వైద్యసేవలకే ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ప్రభుత్వం అందిస్తుందని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం, దేవులపల్లె పంచాయతీ బొజ్జగుంటపల్లె గ్రామాలలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందించారు. 60 ఏళ్లు నిండిన వ్యక్తులకు రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రక్తహీనత కలిగిన గర్భిణులను సురక్షిత ప్రసవం కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో యంపీహెచ్ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, డీఈఓ రోజా, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గోపాలపురంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

కేజీబీవీ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

నిమ్మనపల్లె : మండలంలోని ముష్టూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు, 7,8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వస్తే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఉచితంగా చేయిస్తామన్నారు. దరఖాస్తు చేసేందుకు విద్యార్థి ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలు 2, తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్, కులధ్రువీకరణ పత్రం, చిరునామా, ఫోన్ నంబర్, ఆరో తరగతిలో ప్రవేశాలు కోరే విద్యార్థులు ఐదో తరగతిలో చదివిన వివరాలు, చైల్డ్ ఐడీ నంబర్, హెచ్ఎం ఫోన్ నంబర్ తీసుకురావాలన్నారు.

టక్కోలి ఆర్బీకే తనిఖీ

సిద్దవటం : టక్కోలి గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని గురువారం బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌలుకు ఇసుక భూముల వేలం

బి.కొత్తకోట : స్థానిక చెన్నకేశవ ఆలయానికి చెందిన ఇసుక భూములను దేవదాయశాఖ అధికారులు గురువారం బి.కొత్తకోటలో వేలం పాటలు నిర్వహించి కౌలుకు ఇచ్చేశారు. స్థానిక చెన్నకేశవాలయంలో కార్యనిర్వహణ అధికారి ఎ.మునిరాజ, ఇన్‌స్పెక్టర్ శశికుమార్‌లు చెన్నకేశవాలయానికి చెందిన 47 ఎకరాలకు పైగా భూములు, చౌళేశ్వరాలయానికి చెందిన 8.52 ఎకరాల భూములను మూడేళ్ల కౌలుకు వేలంపాటలు నిర్వహించారు. చెన్నకేశవాలయానికి చెందిన భూములను ఏడాదికి రూ.2.11 లక్షలు, చౌళేశ్వరాలయానికి చెందిన భూములను రూ.22 వేలకు వేలం పాటలో కౌలు దక్కించుకొన్నారు. ఇందులో ఏటిపక్కనే ఉన్న 11.22 ఎకరాల చెన్నకేశవ ఆలయ భూముల్లో విస్తారంగా ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇందులోని ఇసుకను కొంత కాలంగా అక్రమంగా తరలించుకు పోవడంతో కొంత భూమి కనుమరుగై లోయగా మారిపోయింది. దీనిపై దేవదాయశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి షాక్‌కు గురయ్యారు. ఇసుక తోడేయడంతో భూమి పంటల సాగుకు అనువుగా లేదని నిర్ధారించి వెళ్లారు. దీనిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇసుక తరలింపుపై పోలీసులు దాడులు నిర్వహించి పలు కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇదే భూములకు మళ్లీ వేలం వేసి కౌలుకు ఇవ్వడంతో మళ్లీ ఇసుక తరలింపు మొదలయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడి ఇసుక తరలింపు విషయంలో శాంతిభద్రతల సమస్యలు కూడా తలెత్తాయి. ఇసుక తరలింపుదారుల గొడవలు జరిగాయి. దీనిపై మునిరాజ మాట్లాడుతూ ఇసుక భూములను వేలంలో కౌలుకు ఇచ్చామని చెప్పారు. ఇసుక తరలించమని, అందుకు తామే బాధ్యులమని కౌలుదారులు అంగీకరించారని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కౌలు రద్దు చేస్తామని చెప్పారు.

మార్కెట్ వేలం

ములకలచెరువు : ములకలచెరువు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలం పాటల ద్వారా పంచాయతీకి రూ.11.91 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవోఆర్డీ జవహర్‌బాబు తెలిపారు. ఈవోఆర్డీతోపాటు సర్పంచ్ రహమత్‌బీ, కార్యదర్శి ఇబ్రహీంల సమక్షంలో జరిగిన ఈ వేలం పాటల్లో దినసరి మార్కెట్ ద్వారా రూ.6.40 లక్షలు, వారపు సంత ద్వారా రూ.5.51 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వెచ్చిస్తామన్నారు.

నేడు కలికిరిలో..

కలికిరి : కలికిరి గ్రామ పంచాయతీకి సంబంధించిన వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండు, జంతువధశాల రుసుము వసూలు, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణకు శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం జరుగుతుందని సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఈఓ ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చని, వేలం దక్కించుకున్న వారు ఒక ఏడాది పాటు రుసుము వసూలు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు.

దుర్గలమ్మ ఆలయంలో విశేష పూజలు

రామసముద్రం : మండల పరిధి బీసీ కాలనీ సమీపంలోని దుర్గలమ్మ ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఉగాది పురస్కరించుకుని పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా బావిలో గంగమ్మ జాతర

బి.కొత్తకోట : స్థానిక జ్యోతిచౌక్‌లోని బావిలో గంగమ్మ జాతర గురువారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచే భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దీలు, బోనాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేళతాళాలతో ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకారంలో దుర్గలమ్మ

ఘనంగా ఉట్ల తిరునాల

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉట్ల తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆలయం ఎదుట ఆవరణలోని మైదానంలో ఉట్లమానును యువకులు ఉత్సాహంగా ఎక్కారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. స్థానికులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జ్యోతి ఉత్సవాలతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ అధ్యక్షులు ఉప్పు రామచంద్ర, బండి నాగరాజు, ప్రభాకర్, లోకేష్, పురం రమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వాల్మీకిపురం : భగత్‌సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభచరణ్ అన్నారు. గురువారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చి భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్షను రచించిన వ్యక్తి భగత్‌సింగ్ అన్నారు. బ్రిటీష్ వారి చేతుల్లో లాలా లజపతిరాయ్ మరణించడంతో భగత్‌సింగ్ జీర్ణించుకోలేకపోయాడని, అందుకు ప్రతీకారంగా పోలీస్ అధికారిని కాల్చిచంపాడన్నారు. కోర్టు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు మరణ శిక్ష విధించిందన్నారు. ముగ్గురు అమరులై పౌరుషానికి, త్యాగానికి, స్వాతంత్ర్య స్వేచ్ఛకు ప్రతీకగా ప్రజల గుండెల్లో ఈనాటికీ నిలిచి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అమరనాథరెడ్డి, ఉపాధ్యాయులు శంకర, నాగరాజ, రవీంద్రారెడ్డి, కల్పలత, సుమతి, నాగసులోచన, విద్యార్థులు పాల్గొన్నారు.

కాగడాలతో నివాళి



బి.కొత్తకోటలో కాగడాల ప్రదర్శన

బి.కొత్తకోట : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా బి.కొత్తకోటలో కాగడాలతో సీపీఐ కార్యకర్తలు నివాళులర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అమరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించి నినాదాలు చేశారు. తర్వాత కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, మండల కార్యదర్శి సలీంబాషా, జవహర్ బాబు, షమీవుల్లా, తంబయ్యశెట్టి, బాలకృష్ణ, కుమార్‌రెడ్డి, గంగులప్ప పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : మున్సిపాలిటీలోని వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్నటువంటి వలంటీర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. మున్సిపల్ కార్యాలయం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డు–1, సొసైటీకాలనీ.2.–1, ప్రశాంత్‌నగర్–1, కురవంక–1, చౌడేశ్వరినగర్–1, నీరుగట్టువారిపల్లె–1, రామిరెడ్డిలేఔట్–1 మొత్తం 7 వార్డు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వార్డు వలంటీర్ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా నివాసం కలిగిఉండి 18–35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. వలంటీర్ పోస్టులకు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తర్వాత వీరికి ఏప్రిల్ 3 నుంచి 5 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు 7వ తేదీలోపు నియామక ఉత్తర్వులు అందజేసి, 8, 9 తేదీల్లో శిక్షణ ఇచ్చి 10 నుంచి ఉద్యోగంలోకి తీసుకుంటామన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని నాలుగు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తెలిపారు. మద్దయ్యగారిపల్లి, మడుమూరు, సంపతికోట, తుమ్మరకుంట గ్రామాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఆసక్తి గల వారు ఏప్రిల్ 1 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

గుర్రంకొండ : మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుర్రంకొండ, తరిగొండ, సంగసముద్రం, రామాపురం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున, చెర్లోపల్లెలో రెండు, మొత్తం ఆరు పోస్టులకు ఖాళీగా ఉన్నాయన్నారు.